ఆపద్బాంధవ్యం

చలపతిరావు మామూలుగా ప్లేన్లో ప్రయాణంచేసే స్తోమతు వున్నవాడుకాదు. పదిమంది పిల్లలు ఉన్న కుటుంబానికి చెందినవాడు. పైగా కొద్దోగొప్పో సంపాదిస్తున్న అతని తండ్రి ఇటీవలే మరణించాడు. పిల్లల్లోకి పెద్దవాడు అతనే అవటంవల్ల కుటుంబాన్ని ఈదవలసిన భారం అతని మీదే పడింది.

అతను బి. ఏ. ప్యాసయి ఉద్యోగం చెయ్యకుండా ఊరికినే వుంటున్నాడు. ఈనాటి యువకుడు అవటంవల్ల ఉదరపోషణకంటే సంఘసేవ చెయ్యాలనే తాపత్రయం కలిగినవాడు. అతనితండ్రి బ్రతికివున్నంతకాలం అతను ఏం చేసినా చెయ్యకపోయినా జరిగిపోయింది. ఇప్పుడు కడుపు కోసం దేవులాట తప్పనిసరి అయింది. దానికి తగినట్లు ఢిల్లీలోని పబ్లిక్ సర్వీస్ కమీషన్, ఆ మధ్య పబ్లిసిటీ ఆఫీసర్ల పోస్టులకోసం ఎడ్వర్టయిజ్ చేసింది. అతను అప్లయి చేశాడు.

ఆ పోస్టులు రెండు. ఒకటి ఉత్తరాది వాళ్ళకిచ్చినా ఒక పోస్టు దక్షిణాది వాళ్ళకి యివ్వగలరనే ధైర్యంతో అప్లికేషన్ పెట్టుకున్నాడు. అతను అనుకున్నట్లే యిన్టర్వ్యూ వచ్చింది. కాని ఢిల్లీ వెళ్ళి రావటానికి డబ్బేది?

డబ్బుకోసం చాలా ప్రయత్నించాడుగాని పుట్టలేదు. ఇక ఎల్లుండి ఇన్టర్వ్యూ అనగా ఒక స్నేహితుడు అతని దురవస్థచూచి జాలిపడి డబ్బిచ్చాడు. అతనిది విజయవాడ దగ్గర ఒక గ్రామం. అప్పుడు రైల్లో ఢిల్లీకి బయలుదేరితే ఇన్టర్వ్యూ సమయానికి అందుకోలేడు. అందుకని ప్లేన్లో వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. హైదరాబాదువరకూ రైల్లోవెళ్ళి అక్కడ దిగి ఏరోడ్రోముకి వెళ్ళాడు. ఇంక ప్లేన్ రావటానికి వొక గంట టైమ్ వుంది.

జనం హడావిడిగా తిరుగుతున్నారు. కొంతమంది ప్రయాణీకులు సామాన్లు తూకం వేయించుకుంటున్నారు. కొంతమంది హోటల్లో కాఫీలు డ్రింకులూ త్రాగుతున్నారు. ఎదురుగావున్న హాలు విరామసమయంలో ప్రయాణీకులు విశ్రాంతి తీసుకునేది. అక్కడకువెళ్ళి కూర్చున్నాడు చలపతిరావు.

అక్కడ స్త్రీలూ, పురుషులూ చాలామంది వున్నారు. ప్రజలలో ఎవ్వరికి వారికి ప్లేన్లో ప్రయాణం చెయ్యాలనే కుతూహలం వుంటుంది. కాని తీరా ప్రయాణం దగ్గర పడేటప్పటికి ఏమవుతుందో అనేభీతి ఒకటి పట్టుకుంటుంది. అందుకని అక్కడ కూర్చున్న ఎవ్వరి ముఖం మామూలు ముఖంగాలేదు. ఏముఖంలోనూ నెత్తురుచుక్క లేకపోగా విపరీతమయిన టెన్షన్ కొట్టవచ్చినట్లు కనిపిస్తూ వుంది.

వారిని చూస్తుంటే నవ్వు వచ్చింది చలపతిరావుకి.

వారిలో ప్రభుత్వంలో పెద్ద వుద్యోగం చేసే ఆఫీసరు ఒకరున్నారు. వారు చండశాసనులని ప్రతీతి. వారిపేరు చెవిటేచాలు మిగిలిన ఆఫీసర్లంతా హడలిపోతుంటారు. అటువంటి వారుకూడా చేతిలో ముంత పట్టుకుని తన సమాధికి నడచి పోతున్నట్లు ముఖం పెట్టుకొని కూర్చోవటం చలపతిరావుకి చోద్యంగా కనుపించింది. ఒట్టప్పుడు ఎంత అహంకారంవున్నా ఆపద ఎదుర్కొన్నప్పుడు అందరి భయమూ ఒకటే అవటం చిత్రంగా తోచింది చలపతిరావుకి. తనచుట్టూవున్న ముఖాలను పరికిస్తూ కూర్చున్నాడు.

అంతలో ఒక యువతి ప్రవేశించింది హాల్లోకి. చేతులో బ్యాగు పట్టుకొని, ఎత్తయిన మడమలు కలిగిన బూట్లు తొడుక్కొని బాబ్డ్ హెయిర్‌తో ఆమె చాలా ఫ్యాషన్‌బుల్‌గా వుంది. ఒక పాతికేళ్ళ వయస్సు వుండవచ్చు ముఖం మంచి వర్చస్సు కలిగిన ముఖం. ఆ ముఖంకూడా కొద్దిసేపట్లో కాంతిహీనమయి పోతుంది కాబోలు—అని విచారపడ్డాడు చలపతిరావు.

ఆమె అటూ యిటూ చూసింది. నిజంగా అవి లేడిచూపులే.

అందరూ ఆమెవంకే చూస్తున్నారు. ఆమెచూపు చలపతిరావుమీద పడింది. చలపతిరావు కూర్చున్న కుషన్‌లోనే స్థలంవుంది. ఆమె నిస్సంకోచంగా వచ్చి ఆ స్థలంలో కూర్చుంది. అంటే చలపతిరావు సరసనే కూర్చున్న దన్నమాట.

ఇంకేముంది? అంతకుముందు తనచుట్టూ కూర్చున్న వారి ముఖాలు చూచి తనలో తాను నవ్వుకుంటున్న చలపతిరావు అస్థిమితస్థితిలో పడి పోయాడు. ఆమె దగ్గరకు రాగానే సువాసనలు గుప్పున ఎగబడినై. అతని తల తిరిగింది.

ప్రక్కన కూర్చున్న ఆమెను చూడాలనివుంది చలపతిరావుకి. కాని చూడలేకపోయాడు. నరాలు బిగువెక్కినై. అప్పుడు తనముఖంకూడా తన చుట్టూవున్న అందరి ముఖాలు మాదిరిగానే వుండివుంటుంది కాబోలు.... అనుకున్నాడు చలపతిరావు. నవ్వుకోలేక పోయాడు. కాని ఆమెను పల కరించాలని వుంది. ఎక్కడకు వెళుతుందో కనుక్కోవాలని వుంది.

బట్లరువచ్చి "డ్రింకులు కావాలా?" అని అడిగాడు.

ఆమె ఒక డ్రింకుకి ఆర్డరు ఇచ్చింది. వెళ్ళిపోతున్న బట్లరును పిలిచి "నాకుకూడా ఒకటి పట్టుకురా" అన్నాడు చలపతిరావు. ఆ విధంగా మాటకలిపి "తమరు ఎక్కడికి వెళ్తున్నారు?" అని అడిగాడు.

ఆమె మాట్లాడలేదు. పైగా ముఖం అటుత్రిప్పుకు కూచుంది. ఏం చేసేటట్టు? మళ్ళీ అడిగితే ఏమంటుందో! చీదరించుకున్నా చీదరించుకో వచ్చు.

బట్లరు డ్రింకులు తెచ్చాడు. ఆమెతోపాటు అతనూ త్రాగాడు. డ్రింకులకు ఏరోడ్రోంలో మిగిలిన చోట్లకంటే ఎక్కువ తీసుకుంటారని విన్నాడు. ఎంత ఇవ్వాలి? 'ఎంత?' అని బట్లరుని అడిగితే, అసలే తన మీద సద్భావంలేని, ఆమెదృష్టిలో మరీ హీనపడిపోతానేమో అని భయ పడ్డాడు. 'ఎవ్వరీపల్లెటూరి గామార్?' అనుకుంటుందేమో! ఆమెడబ్బు ఇచ్చేవరకూ వూరుకొని ఆమె ఇచ్చినంతా ఇచ్చి ఒక్క నిట్టూర్పు విడి

చాడు. ప్లేన్ వచ్చింది. లౌడ్ స్పీకర్లు ఢిల్లీ వెళ్ళే ప్రయాణీకులు వెళ్ళి కూర్చోవచ్చని ఎనౌన్సు చేసినవి. అంతా బయలుదేరారు. ఆమె చకచకా నడిచి వెడుతోన్న తీరులో ఇతరులలో కనిపిస్తున్న సంకోచంగానీ, భయం గానీ ఏ కోశానా లేదు. ఆప్తమిత్రుని సందర్శనానికి వెళ్తున్నంత సంతోషంగా వెళ్ళింది.

చలపతిరావు నెమ్మదిగా వెళ్ళాడు ప్లేను ఎక్కాడు. ఎయిర్ హోస్టెస్ అతని చేతిలో వున్న కాగితంపు ౘ పరిశీలించి, సీటుచూపింది. ఆ సీటు ఆమె ప్రక్కసీటే. ఆ సీటు దాటివెళ్ళి తనకు నిర్దేశించిన సీట్లో కూర్చు న్నాడు చలపతిరావు. ఆమె అతనిని చాలా నిరసనగా చూసింది. 'ఈ పల్లె టూరి గామార్ ఇక్కడికికూడా వచ్చాడే!' అనిఅనుకుంటూ ఉన్నదను కున్నాడు. కోపంవచ్చి రాచుకుంటూ వెళ్ళి తన సీటులో కూర్చున్నాడు

ప్లేను కదిలింది. అతను పక్క కిటికీలోంచి బయటకు చూస్తు కూర్చుంటే ఆమె తనలోకితాను చూచుకుంటూ కూర్చుంది. ఆమె సీటుకు వున్న బెల్టు నడుముకు చుట్టుకుంది. అతనూ చుట్టుకున్నాడు. బయటకు చూస్తూంటే కండ్లు తిరుగుతున్నట్లనిపించింది.

చూపులు త్రిప్పుకొని కూర్చున్నాడు.

ఎయిర్ హోస్టెస్ వొక పళ్ళెంలో పిప్పరమెంట్లూ, చాకులెట్లూ పోసుకొని వచ్చి అందించింది. అతనుచూశాడు ఆమెవంకే ఒక చాకోలెట్ తీసుకుంది. అదికూడా పళ్ళెంలో వున్న రకాలన్నిటిలోకి చిన్నది. అతనికి చాలా తీసుకోవాలనిపించింది. కాని ఒక్కటే తీసుకున్నాడు అదీ చాకొలెట్టే అదీ అన్నిటిలోకీ చిన్నదే. అన్నీ ఆమెచేస్తున్నట్లు చేస్తున్నందుకు తనమీద తనకు చీదర కలిగింది.

విమానం చాలా ఎత్తున ఎగురుతూంది. ఎంతో క్రిందమేఘాలు దూదిపింజలవలె కదులుతున్నయ్. చలపతిరావుకి చిత్రమనిపించింది. భూమి మీదనుంచి చూస్తే మేఘాలు ఆకాశాన్ని అంటుకొని ప్రయాణం చేస్తున్నట్లు వుంటై. అందుకనే రచయితలు 'ఆకాశాన్ని మేఘాలు అలుముకుంటు

న్నాయి' అని వ్రాస్తారు, ఇప్పుడు తను ఆకాశానికీ, మేఘాలకు మధ్య వున్నాడు. అసలు ఆకాశమనేదే లేదు. ఆకాశం గగనం శూన్యం ఇటు వంటి తప్పులు మానవులు ఎన్ని చేస్తున్నారో! రచయితలు ఎన్ని వ్రాస్తున్నారో! అయినా ఈ తప్పులవల్ల ప్రపంచం బాధపడుతున్నట్లేలేదు. దాని ధోరణిలో అది నడిచి పోతూ వుంది. "ఈ ప్రపంచానికి తప్పులను ఇముడ్చుకొని, జీర్ణించుకొని బ్రతికేశక్తి వుంటుంది.' అనుకున్నాడు చలపతిరావు

"అది కొంచెం ఇటు త్రిప్పండి" అన్న దామె.

"ఏదీ?" అన్నాడు చలపతిరావు, ఆమె కంఠధ్వనికి ఉలికిపడి. ఆమె తనను పలకరిస్తుందని అతను అనుకోలేదు.

"అదే" అని గాలివచ్చే బుగ్గను చూపింది. ప్రతిసీటుకి ప్రక్కన గోడకు గాలివచ్చే రెండుబుగ్గలు వుండటం అతను అంతకుముందే చూశాడు. ప్రయాణీకులు వాటిని తమ వైపుకు త్రిప్పుకోవటంకూడా చూశాడు. కాని అతను వాటిజోలికి వెళ్ళదలచలేదు, ఏం చెయ్యబోయి ఏం చేస్తానో అనే భయంతో; ఏం చేస్తే ఏమవుతుందో అనేభయంతో. ఇప్పుడా బుగ్గలను తన వైపుకు త్రిప్పమంటూవుందే. అసలే ఆమెమీద కోపంగా వుందేమో, "మీరే త్రిప్పుకోండి" అన్నాడు చలపతిరావు.

ఆమె త్రిప్పుకు కూచుంది. అతను మళ్ళీ కిటికీలో నుంచి బయటకు చూశాడు. ఈసారి కాస్త ధైర్యం తెచ్చుకొని క్రిందకు చూశాడు. భూమ్మీద ఉన్న పెద్దపెద్దవూళ్ళు బొమ్మరిళ్ళలాగ అగుపించినై. భూమిమీదవుంటే ఆఊళ్ళే గొప్పవిగా కన్పిస్తయి. పెద్దపెద్ద సౌధరాజాలుగా కనుపిస్తయి. ఆకాశం మీదినుండి చూస్తే అనంతంగా కనుపిస్తున్న భూమి మీద, ఈఊళ్ళు సముద్రంలోని కాకిరెట్టలుగా, సున్నపు పిడచలుగా కనిపించి, హాస్యాస్పదంగా వున్నయ్. ఇక ఆ ఊళ్ళల్లో నివసించే మనుష్యుల సంగతి వేరే చెప్పాలా?

మానవుడు ఎంత అల్పజీవో అప్పుడు తట్టింది చలతివరావుకి. భూమి

మీద నిలబడి తనకు కనపడేటంతవరకే నిజమనుకొని, అంతా తనమీదుగానే నడుస్తూ వుందనుకొని, భ్రమపడి, దురహంకారము పెంచుకుంటాడు. కాని నిజంగా అతను ఒక్క నలుసు. ఆసంగతి ఆకాశాన్నుంచిచూస్తే ఇట్లే బోధపడుతుంది. మానవుడు పట్టినలుసు. నలుసులో నలుసు.

ఎయిర్ హోస్టెస్‌ముఖంలోపెట్టి "టీ యా? కాఫీయా?" అనిఅడిగింది ఆమెను.

ఆమె "కాఫీ" అన్నది.

అదేవిధంగా చలపతిరావుని అడిగింది.

చలపతిరావుకి అంతఎత్తున టీ కాఫీలు ఇస్తారని తెలియదు. అప్రయత్నంగా 'టీ' అన్నాడు.

మరుక్షణం తనప్రక్క కూర్చున్న ఆమె అడిగింది తను అడగనందుకు సంతోషించాడు.

ఎయిర్‌హోస్టెస్ ఆమెకు కాఫీ, అతనికి టీ తెచ్చి యిచ్చింది. ఆ క్షణం ఆమె అమృతం పంచిపెడుతున్న దేవతలాగా కనుపించిందతనికి సన్నగా, చక్కగావున్నది. ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూ వుంది. తొణుకు బెణుకు లేకుండా పలకరిస్తుంది. ముచ్చటగా మాట్లాడుతుంది. ఇంకేం కావాలి?

"థ్యాంక్స్" అన్నాడు ఆమె అందించిన టీ కప్పు తీసుకుంటూ. టీతోపాటు ఆమె కొన్ని బిస్కట్లు కూడా ఇచ్చింది. ముందు సీటు వెనుక భాగానవున్న బల్ల పరిచింది. అది టేబుల్‌లాగు వుపకరిస్తుందని గ్రహించాడు చలపతిరావు.

బిస్కట్లప్లేట్లూ, టీ కప్పూ దానిమీద పెట్టుకున్నాడు. చల్లగా వుండటంవల్లో, భయం కలిగిన టెన్షన్ వల్లోగాని టీ అమృతప్రాయంగా ఉంది చలపతిరావుకి

అంత ఎత్తున టీత్రాగే అదృష్టం తనకు దొరికినందుకు విధిని మెచ్చుకున్నాడు.

ఆమె కాఫీ ముగించింది. ఎంత నెమ్మదిగా త్రాగినా తానే ముందు

ముగించాడు. ఎయిర్‌హోస్టెస్ కప్పులూ, ప్లేట్లు పట్టుకుపోయింది..ముందు సీటు వెనకభాగంలో ఉన్న బల్లలను మూసివేసింది.

ప్లేన్ క్రిందకు దిగుతూ ఉంది. ఆమె ఏదో ఆలోచిస్తూ ఉంది. కాస్త కలవరపడుతూ ఉందనిపించింది చలపతిరావుకి. ఎందుకు కలవరం?

ప్లేను నాగపూర్ ఏరోడ్రోమ్‌లోకి దిగింది. ప్రయాణీకులందరూ దిగారు. అకస్మాత్తుగా ఆమె పలకరించింది.

"మీరు ఇక్కడ దిగుతున్నారా?"

"లేదు"

"ఢిల్లీ వస్తున్నారా?"

"అవును".

ఇంకేదో అడుగుదామని కాసేపు తచ్చాడి ఆమెకూడా ప్లేన్‌దిగి బయటకు వెళ్ళింది. ప్లేన్‌మళ్ళీ బయలుదేరేవరకూ విశ్రాంతి తీసుకోటానికి గాను ప్రయాణీకులు దిగారని తెలుసుకొని తానూ దిగాడు చలపతిరావు. ఉన్నట్టుండి ఆమెలో యింతమార్పు యెందుకు వచ్చిందో అతనికి అర్థం కాలేదు.

ఏమీతోచక పుస్తకాలషాపుముందు చూస్తూ నిలబడ్డాడు. కాసేపటి ఆమెకూడా వచ్చింది. డ్రింకు తాగివచ్చిందని గ్రహించాడు చలపతిరావు "నేనూ ఢిల్లీ వస్తున్నాను" అన్నది.

అతనికి ఏమి సమాధానం చెప్పాలో తోచక మొదలకుండా ఊరు కున్నాడు

"నాగపూర్ దాటిం తర్వాత ఇటీవలే ప్లేన్‌కి రెండు సార్లు యాక్సి డెంట్ అయింది" అన్నది.

"నేను పత్రికలో చదివాను."

"ఈసారి అటువంటి ప్రమాదం ఏమీ జరుగదుకదా!"

ఆమెలో వచ్చినమార్పుకి కారణం అతనికి లీలగా అర్థమయింది. "ఎలా చెప్పగలం?" అన్నాడు.

"ఏదన్నా జరిగితే?"

"పూర్వులు పోయినవారినే పోవలసివస్తుంది."

ఆమెముఖం వివర్ణమయింది. కండ్లు చెమ్మగిలినై. అతనికి జాలి వేసింది. నవ్వుతూ అన్నాడు-"ఏ ప్రమాదమూ జరుగదులెండి" తనకు ఆ విషయం బాగా తెలిసినట్లు.

"జరుగదా?" అని ఆతురతగా అడిగింది ప్రమాదాలు జరగటం, జరక్కపోవటం అతని చేతుల్లోనే వున్నట్టు.

"జరుగదు."

"థ్యాంక్సు" అన్నది. ఆమె వొక నవల కొనుక్కున్నది.

లౌడ్‌స్పీకర్ ప్రయాణీకుల్ని ప్లేన్‌లోకి వెళ్ళి కూర్చోమని చెప్పింది అంతా వెళ్ళారు. ఎవరిసీట్లలో వారు యథాప్రకారం కూర్చున్నారు. ప్లేన్ ఢిల్లీ పయనమయింది రొప్పుకుంటూ, రొదచేసుకుంటూ.

ఆమె ప్రాణాలు బిగపట్టుకు కూర్చుంది.

ఆమె మనస్సులో చెలరేగుతున్న ఆలోచనలను మరచిపోవటానికి గాను, "మీరు ఏ పనిమీద వెళ్తున్నారు?" అని అడిగింది.

"ఉద్యోగంకోసం"

"ఏం ఉద్యోగం?"

అతను చెప్పాడు. ఆమె కొంచెంసేపు ఆలోచించి "నేను సహాయం చెయ్యగలను" అన్నది. ఢిల్లీలో వొక ప్రభుత్వోద్యోగిని తాను యెరుగుదునని; ఆయనతో రికమెండ్ చేయించగలననీ చెప్పింది.

"థ్యాంక్సు" అన్నాడు చలపతిరావు, అనుకోకుండా వచ్చిన ఈ సహాయానికి మనస్సులో చాలా సంతోషించాడు.

"ఢిల్లీలో మీరు ఎక్కడ దిగుతారు?" అని అడిగింది

"ఇంకా యేమీ అనుకోలేదు."

"మీకు అభ్యంతరం లేకపోతే నాతో రండి. నేను ఒక మిత్రుని ఇంట్లో బసచేస్తున్నాను. ఆయన సంతోషిస్తాడు."

"ఎందుకు మీకు శ్రమ? ఎడ్రస్ యిస్తే మిమ్మల్ని వచ్చి కలుస్తాను."

"శ్రమ యేమీలేదు. అక్కడ హోటళ్ళలో గదులు దొరకడం

కష్టం. పైగా ఆ తిండి మనకు పడదు. నా మిత్రుని తరపున మిమ్మల్ని నేను ఆహ్వానిస్తున్నాను"

"థ్యాంక్సండి, అలాగే వస్తాను" అన్నాడు చలపతిరావు.

ప్లేను ఆకాశం యెత్తున లేచి వెళ్తూవుంది.

ఆమె కాసేపు మాట్లాడకుండా కూర్చుంది. ఇటీవల జరిగిన ప్లేను యాక్సిడెంట్లను గురించి ఆమె ఆలోచిస్తూ ఉందని గ్రహించాడు చలపతి రావు. ఆ యాక్సిడెంట్లు ఈ ప్రాంతాలే జరిగినవని పత్రికల్లో చదివినట్లు గుర్తు. నవల తీసింది. చదువబుద్ధి అయినట్లులేదు. కిటికీలోనుంచి బయటికి చూస్తూ—

"వాన కురుస్తున్నది" అన్నది బాధాకరంగా.

"లేదు" అన్నాడు చలపతిరావు తానూ కిటికిలోంచి చూస్తూ.

"అటుక్రిందకి చూడండి" వేలుపెట్టి చూపించింది.

నిజమే, ముసురు కప్పుకొని భూమి కనిపించటంలేదు. అప్పుడు చలపతిరావుకి జ్ఞాపకం వచ్చింది. మేఘాలు వర్షిస్తాయనీ, మేఘాలకుపైగా తాము ప్రయాణం చేస్తున్నామని మేఘాలకుపైగా ప్రయాణం చేస్తున్న తమకు దగ్గరగా వర్షంకురిసే అవకాశంలేదు. విమానానికి భూమికి మధ్య స్థలంలో యెక్కడనుంచో వర్షం ప్రారంభ మవుతుంది. ఈ దృశ్యం చిత్రంగా ఉంది చలపతిరావు మనస్సుకి. తాను వర్షానికిపైన ఉన్నాడు. వర్షంకురిసేది తనక్రింద.

"వర్షం కురిసేది క్రిందగదా! మనకేమి?" అన్నాడు.

"ప్లేన్ దిగటం కష్టం అవుతుంది. వర్షం యెక్కువగా కురుస్తుంటే దిగవలసిన స్థలం పైలెట్‌కి కనబడదు" అన్నది విచారంగా.

"అప్పుడు యేం చేస్తాడో?"

"ఇంకొక చోటుకి వెళ్తాడు"

"అక్కడా వర్షం కురుస్తుంటే?"

"మరింకొక చోటుకి"

"ఈలోగా పెట్రోలు అయిపోవటమో, ఇంకేదన్నానో జరిగితే?"

"రిస్కు తీసుకుని ప్లేన్ దింపుతాడు"

ఈ మాటకు చలపతిరావుకికూడా కొంచెం భయం వేసింది. ఇంటి దగ్గర తనకు ఉద్యోగం వస్తుందనీ, తమ కష్టాలు గడుస్తవనీ పిల్లలను చుట్టూ కూర్చోపెట్టుకొని ఎదురు చూస్తున్న తల్లి జ్ఞాపకం వచ్చింది.

అతను చలించాడని గ్రహించిం దామె. మానసిక సాన్నిహిత్యం ఎక్కువైంది. అతనిపై పుకు తనకు తెలియకుండానే జరిగింది. ఒక్క నిట్టూర్పు విడిచింది. ఆ నిట్టూర్పు అతని కంఠానికి వేడిగా తగిలింది.

"ఏమి కానున్నదో" అన్నది.

"మనకేం తెలుస్తుంది?" అన్నాడు చలపతిరావు. ఒక్కసారి ప్లేన్లో వున్న ప్రయాణీకుల నందరినీ కలయజూశాడు. అందరూ భయంతో బిర్ర బిగుసుకొని కూర్చున్నట్లే కనుపించారు. ఎవరికివారు ప్రక్కవారితో మాట్లాడటానికే భీతావహంతో ఉన్నారు. అందరూ శ్మశానానికి వయ నిస్తున్న ముఖాలతో కూర్చునివున్నారు. భయంతో బిత్తరిచూపులను ప్రస రిస్తూ, బిగదీసుకొనిపోయి ఉన్న యిన్ని ముఖాలను అతను ఇంతకు ముందు ఎన్నడూ చూచియుండలేదు. యెవరి మగణగీతం, వారే ఆలకిస్తు న్నట్లున్నారు.

"మీరు ఎవరున్నారు ఇంటి దగ్గర?" అని అడిగిందామె.

"అమ్మ" అన్నాడు చలపతిరావు. అతనికి తెలియకుండానే అతని కంఠం గాద్గదికమయింది, ఆధ్వనికి అతని నరాలు సడలినయి

"మీకో?" అని అడిగాడు, అదే కంఠస్వరంతో.

"మా ఆయన—" అన్నది. ఇంక మాట్లాడలేకపోయింది. కండ్ల వెంట నీరు జలజల ప్రవహించింది.

"ఊరుకోండి" అన్నాడు అప్రయత్నంగా ఆమె చెయ్యిమీద చెయ్యివేశాడు వోదార్పుగా. అతని శరీరం జలదరించింది. నెమ్మదిగా నిమిరాడు

ఆమెకు అదేమీ విపరీతంగా కనుపించలేదు. నెమ్మదిగా పమిటె చెంగుతో కన్నీరు అద్దుకుంది.

"ఏమవుతుందో?" అన్నది.

"ఏమీకాదు" అన్నాడు చలపతిరావు అమె వేళ్ళు సవరిస్తూ.

అంతలో ప్రయాణం చేస్తున్న ప్లేన్‌నుంచి వింతధ్వని ఒకటి బయలుదేరింది. సన్నగా బయలుదేరి క్రమ క్రమేణా పెద్దదయింది. అంతా నిలువుగుడ్లువేసి చూస్తూ కూర్చున్నారు. సూట్‌లోఉన్న పెద్దఉద్యోగి కంగారుగా లేవబోయి ప్లేన్‌వూపుకి మళ్ళీ చతికిలబడ్డాడు. ఎయిర్ హోస్టెస్ చిరునవ్వు నవ్వుకుంటూ అతని దగ్గరకు వెళ్ళింది.

"ఏమిటది?" అని అడిగాడు ఎయిర్‌హోస్టెస్‌ను.

"మరేంలేదు. భయపడకండి" అన్నదామె.

చలపతిరావు విన్నాడు. ప్రక్కనున్న ఆమె విన్నది.

"ఎక్కడ బెంబేలు పడిపోతామో నని వాళ్ళు అలాగే అంటారు" అన్నది చలపతితో.

"అయితే మనం ప్రమాదానికి లోనైనట్లేనా?"

"ఇంకా అడుగుతున్నారా?" అని వెక్కి వెక్కి ఏడువ నారంభించింది.

"ఊరుకోరూ, నా మాట వినరూ?" అని సముదాయించాడు చలపతిరావు, ఆమె చేతిని పూర్తిగా తనచేతిలోకి తీసుకుంటూ. మరణించవలసివస్తే తమతోపాటు సూట్‌వేసుకొని కంగారు పడుతున్న ఆ ప్రభుత్వోద్యోగికూడా వున్నాడనే సంతోషం అతని మనస్సులో చటుక్కున మెరిసింది పైగా అతను వొంటరిచావు చస్తాడు తన చేతిలోవున్న ఆమె చెయ్యి కదిలింది.

"మా ఆయన సంగతి మీకు చెప్పలేదు" అన్నదామె

"అవును" అన్నాడతను విచారంగా.

"నన్ను చాలా హింసించాడు. నా మనస్సును ముక్కలు క్రింద తరిగాడు. ఆయన నల్లగావుంటాడు. అందుకని ఆయనంటే నాకు ఇష్టం లేదని ఆయన అనుమానం.... చివరికి విసిగి ఆత్మహత్య చేసుకుందామనుకున్నాను.... ఆ సమయంలో తటస్థపడ్డాడు— దేవుడు ప్రత్యక్షం అయినట్లు అయినారు—"

"ఎవ్వరు?" అని అడిగాడు చలపతిరావు విచారంగానే.

"కృష్ణానందం.... ఇప్పుడు నేను వెళ్ళేది ఆయన దగ్గరకే" అని ఏడవదొడగింది.

ఆమె అంత భయపడి పోవటానికి కారణం చలపతిరావుకి అప్పుడు పూర్తిగా అర్ధంఅయింది. చెయ్యి నిమురుతూ, వేళ్ళు సవరిస్తూ ఎంతో ఇదిగా సముదాయించాడు. ఆపత్కాలంలో అందరినోటినుంచి వెలువడే మాటలే అతని నోటినుంచి వచ్చినై.

"భగవంతుడున్నాడు. మనం సురక్షితంగా జేరుతాం"

ఆ మాట అన్నాడో లేదో విమానం; ఒక్కకుదుపు కుదిపింది. ఏ క్షణం పల్టీ కొడుతుందో అన్నంత ఒడుదుడుకులుగా ప్రయాణం మొదలు పెట్టింది. విమానం అంతా గందరగోళం అయింది. సూటులో వున్న పెద్ద ప్రభుత్వోద్యోగి, "అమ్మో!" అని బిగ్గరగా ఆక్రోశించి లేచి నిలబడ్డాడు. ఆ పెనుకేకతో విమానం దద్దరిల్లిపోయింది. ఆమె చలపతిరావు కంఠం కావిలించుకొని పెద్దపెట్టున ఏడవ నారంభించింది. "నా జీవితం ఇట్లా అంతం కావలసిందేనా?.... కృష్ణానందంగారిని చూచే ప్రాప్తం కూడా లేదా.... ఈ జన్మకి?" అని అడుగుతూనే వుంది. చలపతిరావుకి ఏమి చెప్పాలో తెలియక తలనిమురుతూ కూర్చున్నాడు. చెక్కిళ్ళు కూడా నిమిరాడు. "నా మాట నమ్మండి. మనకు ఏ ఇబ్బందీ రాదు" అంటూనే వున్నాడు.

అంతలో విమానం తేరుకుంది. ఎయిర్‌హోస్టెస్ ఎక్కడివారిని అక్కడ కూర్చోబెట్టే ప్రయత్నంలో వుంది. "ప్రమాదం ఏమీలేదు. ఎవ్వరూ కించిత్తుకూడా భయపడ వలసిన అవసరంలేదు"అనిలౌడుస్పీకరులో చెప్పింది.

"ప్రమాదం లేదా?" అని, వొణికిపోతూ బిగ్గరగా కేకవేసి అడిగాడు సూటులోవున్న ఆ పెద్ద ప్రభుత్వోద్యోగి.

"లేదు" అని నమ్మకంగా చెప్పింది ఎయిర్‌హోస్టెస్.

అంతా ఒక్క నిట్టూర్పు విడిచారు. ప్రభుత్వోద్యోగి సీట్లోకి నెమ్మదిగా జారుకున్నాడు. తోష అయ్యాడు.

కాని ఆమె మాత్రం చలపతిరావు బుజంమీదనుంచి తల తియ

లేదు కన్నీటితో అతని బుజం తడుపుతూనే వుంది. "చూడండి, ప్రమాదం లేదుట. ప్లేన్ మామూలుగానే ప్రయాణం చేస్తూవుంది" అని అతను అంటూనే వున్నాడు. ఆమెమాత్రం కన్ను విప్పలేదు. దూరాన్నించి ఈ పరిస్థితి చూచి వేడికాఫీ పట్టుకొని వచ్చింది ఎయిర్‌హోస్టెస్. చలపతిరావు బుజం మీద తలఆన్చి కంఠాన్ని ఆనిలించుకొని ఉన్న ఆమెనులేపి, బలవంతంగా కాఫీ త్రాగించింది. తలపైకెత్తి కొస్త కొస్త చొప్పున నోట్లో పోసింది.

ఆమె తెప్పరిల్లి, "నేను ఎక్కడున్నాను?" అని అడిగింది.

"ఢిల్లీకి దగ్గర్లో వున్నాం" అని చెప్పింది ఏయిర్ హోస్టెస్?

"ఏక్సిడెంటు కాలేదా?"

"ఏక్సిడెంటు అవటం ఎందుకు?"

"నిజమేనా?"

"నిజమే!"

ఆమెఒక్కసారి ప్రయాణీకుల నందరీని తేరిపారచూసింది. ప్రభుత్వోద్యోగి, తన ప్రక్కనవున్న అతనితోనూ, వెనుకనవున్న అతనితోనూ, చిరునవ్వు నవ్వుతూ ఏదో గంభీరంగా మాట్లాడుతున్నాడు. ఏ పరిస్థితుల్లోనైనా మనిషి నిబ్బరం కోల్పోకూడదని ఆ మాటల సారాంశం.

"మరి వర్షమో?" అన్నదామె.

"తగ్గిపోయింది" అని చెప్పింది ఎయిర్‌హోస్టెస్?

"ఇందాక ఎందు కంత గందరగోళం జరిగింది?"

"ప్లేను కొస్త ట్రబుల్ ఇచ్చినమాట యదార్థమే"

"మళ్ళీ ఇవ్వదని నమ్మకం ఏమిటి?"

"ఇక ఇవ్వదు. అదీకాకుండా ఢిల్లీకి దగ్గిరకు వచ్చాం? అదిగో ప్లేయిను దిగుతోంది? కొస్తబెల్టుకట్టుకుంటారా?" అని చిరునవ్వు నవ్వుతూనే బెల్టుకట్టింది. చలపతిరావు తనకుతానే బెల్టుకట్టుకున్నాడు. ఎయిర్ హోస్టెస్ చిరునవ్వు నవ్వుకుంటూ మరొకసీటు దగ్గరకు వెళ్ళింది.

ప్రమాదం తప్పిందని తెలియగానే ఆమె క్షణంలో మారిపోయింది. ముఖంలోకి రక్తం ప్రవహించి మళ్ళీ కలకలలాడుతూఉంది. చెక్కిళ్ళ

మీద ఇంకా కన్నీటిధారల సుయలు కనుపిస్తున్న నునుపుకు తిరిగినై? కండ్లు తేజస్సుతో తళతళలాడుతున్నాయి.చిరునవ్వు చిందిస్తూ ఉంది.

ఆమెను పలకరించడానికి చలపతిరావుకి సంకోచం ఉదయించింది. క్షణంలో తనకామె దూరం అయినట్లనిపించింది?

ఆమె అతనిని క్రీగంటచూచి, సిగ్గుపడింది. అంతలో చిరాకుపడి పమిటసర్దుకొని కూర్చుంది.

కాస్తదూరంగా చిత్రంషూటింగుకి తయారుచేసుకున్న మోడల్‌సెట్ వలె కనిపిస్తూనేఉంది ఢిల్లీ? ప్లెయిను....దిగుతూఉంది.పొలంనుంచి ఇంటికి తిరిగివచ్చే ఎడ్లజంటవలె ఆవురుమంటూ దిగుతూఉంది ఆహారాన్ని తన్నుకుపోవడానికి దిగే గ్రద్దవలే దిగుతూవుందనికూడా చెప్పుకో వచ్చు.

చల్లనిగాలి వీస్తూఉంది. త్వరలోనే ఢిల్లీలో ఆగబోతున్నాం గదా అని ఆమెను పలకరించడానికి ప్రయత్నించాడు చలపతిరావు. ఇంతకీ ఆమె పేరే తనకు తెలియదు. పేరుఅయినా తెలుసుకుందామని అనుకున్నాడు. తెలుసుకుందాం అనుకోవటంకాదు, జరిగిందాన్నిబట్టి ఆ బాధ్యత తనమీద ఉందనుకున్నాడు?

కాని అతనికి ఆ అవకాశం దొరకలేదు. ఇమె ఏదో ఆలోచించు కుంటూ తనలోతాను చిరునవ్వులను మలుపుకుంటూఉంది. “చూడండీ” అన్నాడు. కాని చూచేదిఏమీలేదు అమె పలుకలేదు, పలకరించలేదు నెమ్మదిగా నవలతెరిచి చదువుకుంటూఉంది.

ప్లేను ఆగింది? ప్రయాణీకులు సురక్షితంగా జేరాం అనే సంతో షంతో గబగబా దిగారు. అందరికంటె ముందు ఆమె దిగింది. హడావుడిలో నవల మరచిపోయింది. ఆ నవల తీసుకొంటూ, ఉన్నట్టుండి ఆమె ఎందు కంత ముడుచుకుపోయిందా అని ఆలోచించుకొంటూ, చలపతిరావు దిగాడు.

ఆమెకు ఎదురుగా ఒక యువకుడు మందహాసం చేసుకొంటూ వచ్చాడు. ఆ యువకుణ్ని చూసేటప్పటికి ఆమె ఉప్పొంగి పోయింది. పరి సరప్రాంతాలను మరచిపోయి అతనికి తనచెయ్యి అందించింది. ఏదో

మాట్లాడుతూనుంచుంది. అతను ఇంతింత కండ్లు చేసుకొని వింటున్నాడు. ప్లేన్ ప్రమాదాన్ని గురించి చెపుతూవుందని ఊహించాడు చలపతిరావు. గతించిన విషయంగనుక నవ్వుతూ వొక జానపద కథను అభివర్ణిస్తున్నట్లు చెపుతూ వుంది.

ఇప్పుడు తనేం చెయ్యాలనేది పెద్దసమస్య అయింది చలపతిరావుకి. ఆమె తనతోపాటు తన మిత్రుని ఇంట్లో వచ్చి వుండమన్నది.

కనీసం చెప్పయినా వెళ్దామని వాళ్ళదగ్గరకు నడిచి నిలబడ్డాడు. పుస్తకం ఇవ్వవలసిన బాధ్యత వొకటి వుండనే ఉన్నదిగదా!

"నాతో ఏమన్నా పని వున్నదా?" అని అడిగాడు ఆ యువకుడు.

"లేదు" అని తలవూపి ఆమె వంకకుచూశాడు. ఆమె ఏదే ఒకటి తేల్చి చెప్తుతుందని ఆశపడ్డాడు. ఆమె వొక పర్యాయం అతనిని నఖశిఖ పర్యంతంచూసింది. అంతే, ఎరగనట్లు మొఖం త్రిప్పివేసుకొంది. దగ్గరకు వెళ్ళి, "పుస్తకము మరిచిపోయారు" అని అందించాడు.

"థ్యాంక్సు" అన్నది మరచిన సామాను తెచ్చిపెట్టిన ఏ పరాయి వాడితోనో అన్నట్లు.

"కారు బయటవుంది, ఇక వెళదామా?" ఆమెను ఆ యువకుడు అడిగాడు.

"అలాగే" అన్నదామె? అంతే, చలపతిరావువంక తిరిగన్నాచూడ లేదు. వాళ్ళు ఇద్దరూ చెట్టాపట్టాలు పట్టుకొని బయటకు నడిచి వెళ్ళారు. చలపతిరావు నిర్విణ్ణుడై చూస్తూ నిలబడ్డాడు. ఆమె చెప్పిన కృష్ణానందం అతనేనని గ్రహించడానికి అతనికి యెక్కువసేపు పట్టలేదు. అయితే మాత్రం, తననింత నిర్లక్ష్యంచేయవలసిన అవసరమేముంది? అంత గాఢమైన గతాన్ని అంత తేలికగా యెలా తుడిచి వెయ్యగలిగింది? తన పరిచయాన్ని అంగీకరించడానికి ఆమె సిగ్గూ, బాధా పడుతున్నట్లు కనిపించింది.

ఎందుకు? తన తప్పేముంది!

కాళ్ళు యీడ్చుకొంటూ బయటకు బయలుదేరాడు చలపతిరావు.

)o........o(